



పాగుళ్లపల్లిలో విజేత జట్టుకు బహుమతిని అందజేస్తున్న సీతక్క

ఓటమితో ఆగిపోవద్దు.. గెలుపు కోసం కృషి చేయాలి

పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క

కొత్తగూడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో ఓటమితో కుంగిపోవద్దని, గెలుపు కోసం శ్రమించాలని పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క సూచించారు. కొత్తగూడ మండలంలోని పొగుళ్లపల్లి లోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడల ముగింపు కార్యక్రమానికి శనివారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడల్లో విజేతలకు మంత్రితో పాటు ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంగం ఏదైనా గమ్యం చేరుకునేందుకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగి.. విజేతలుగా నిలవాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వతహాగా క్రీడాకారుడు కావడంతో, ఆటలను ఎప్పుడు ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నాడని పేర్కొన్నారు. క్రీడల్లో ఎంపిక కానివారు బాధపడవద్దని, ఓటమి విజయానికి మెట్టుగా భావించి కృషి చేయాలని సూచించారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనవారు ఒరిస్సాలోని రూర్కెలాలలో నిర్వహిస్తున్న జాతీ యస్థాయి క్రీడల్లో తెలంగాణ రాష్ట్రంను మొదటి స్థానంలో విజేతగా నిల పాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా నారా యణరెడ్డి, స్టేట్‌స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్యానాయక్, ప్రిన్సిపాల్ అజయ్ సింగ్, సీఐ సూర్య ప్రకాష్, ఎస్సై రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, క్రీడా కారులు పాల్గొన్నారు.



తన గోడు వెళ్లబోసుకుంటున్న వృద్ధురాలు సోమక్క

కన్నతల్లిని రోడ్డుపై వదిలేశారు..

- వృద్ధాప్యంలో ఉన్న తల్లిని చూసుకోలేక ఓ కూతురు నిర్వాకం
- వర్షంలో దిక్కుతోచని స్థితిలో బాధితురాలు

దంతాలపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసిన పేగు బంధాన్ని మరిచారు ఆ కూతుళ్లు.. వృద్ధ తల్లిని రోడ్డుపై వదిలేశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో చోటు చేసుకుంది. గున్నెపల్లి గ్రామానికి చెందిన రామగిరి సోమక్కకు(85) ఐదుగురు ఆడ సంతానం.అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. భర్త పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, అప్పటి నుంచి తన పనులు తాను చేసుకుంటూ భర్త నిర్మించిన ఇంట్లోనే ఉంటోంది. అయితే కొద్దిరోజుల క్రితం నుంచి సోమక్కకు ఆరోగ్యం సహకరించకపోవడంతో గున్నెపల్లి గ్రామంలో ఉండే కూతురు ఆత్మకూరి రమ వద్ద రెండు నెలలుగా ఆశ్రయం పొందుతోంది. అయితే తల్లితో తనకు ఇబ్బందులు వస్తున్నాయనే కారణంతో రమ ఆమెను శనివారం గ్రామంలోని రోడ్డుపై వదిలేసివెళ్లింది. దీంతో సోమక్క దిక్కుతోచని స్థితిలో రోడ్డుపై గల సిమెంట్ కుర్చీపైనే దీనంగా మిగిలిపోయింది. గ్రామంలో రమతో పాటు రెండో కుమార్తె కూడా ఉంటోంది. వర్షంలో సోమక్క తడుస్తున్నా వారు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిండిలేక రోజంతా పస్తులున్నట్లు సోమక్క తెలిపింది. తన ఐదుగురు కూతుళ్లలో ఇద్దరు గున్నెపల్లిలో, ఒకరు దాట్లలో, ఒకరు తట్టుపల్లిలో, ఒకరు ముకుందాపురంలో ఉంటారని తెలిపింది. తమకున్నంతలో బిడ్డలను పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు చేశామని, ఇప్పుడు కాటికి పోయే దశలో తాను వారికి భారమయ్యాయనని కన్నీళ్లపెట్టుకుంది. వృద్ధురాలి దీనస్థితిని చూసిగ్రామస్థులువిచారం వ్యక్తంచేస్తున్నారు.



యువ వికాస స్కీం కోసం ఎదురు చూపు

- దసరా నాటికైనా పథకం అమలయ్యేనా?
- జిల్లాలో 47,316 దరఖాస్తులు

నిరీక్షణ

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రాజీవ్ యువవికాస పథకం అమలు ఆలస్యమవుతోంది. దరఖాస్తులు పెద్ద సంఖ్యలో రావడం.. రూ. 4 లక్షల కోసం ఎక్కువగా రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు ఉండడంతో రూ. లక్ష లోపు దరఖాస్తు చేసుకున్న యువతకు మంజూరు చేయాలని రాష్ట్ర సర్కార్ భావించింది. తొలుత తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న రూ. 50 వేల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇచ్చి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించాలని ప్రభుత్వం భావించినా.. అది ఆచరణ సాధ్యం కాలేదు. వందశాతం రాయితీతో రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందించేందుకు జిల్లాలోని మండలాల వారీగా లబ్ధిదారుల ఎంపిక పూర్తయి నెలలు గడుస్తున్నాయి. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నైనా వస్తాయని ఆశ పడ్డ యువ వికాసం దరఖాస్తుదారులకు నిరాశే ఎదురైంది. దసరా వరకైనా యువవికాసం పథకం రుణాలు వస్తాయని దరఖాస్తు చేసుకున్న వారు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక యువతకు ఉపాధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకువచ్చారు. అందు కోసం రూ.6 వేల కోట్ల బడ్జెట్‌నూ కేటాయించారు. ఇప్పటికే అందులో నుంచి రూ.2 వేల కోట్లు యువ వికాస పథకానికి కేటాయించారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీతో బ్యాంకు రుణాల కోసం యువత నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రూ.50 వేల వరకు వంద శాతం సబ్సిడీ ఇవ్వగా రూ. లక్ష, రూ.2 లక్షలు, రూ.4 లక్షలకు కొంత సబ్సిడీ ప్రకటించారు. యువత పెద్ద మొత్తంలో దరఖాస్తులు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో యువత దరఖాస్తులు చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 18 మండలాల పరిధిలో 47,316 మంది దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 47,316 మంది దరఖాస్తులు చేసుకోగా ఇందులో ఎస్సీలు 8,688 మంది, ఎస్టీ కేటగిరీ నుంచి 18,732 మంది, బీసీలు 19,262 మంది. ఈబీసీ నుంచి 578, క్రిస్టియన్ మైనార్టీలు 56 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

కొండంత ఆశతో ఎదురుచూపు

రాజీవ్ యువ వికాస పథకం ద్వారా సబ్సిడీతో బ్యాంకు రుణాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్న యువత వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. దరఖాస్తులు చేసుకున్న యువత తమకు వెంటనే లబ్ధి చేకూరుతుందని భావించారు. యువ వికాసం దరఖాస్తుదారులకు త్వరలోనే రుణాలందిస్తామని పాలకులు తమ ప్రసంగాల్లో చెబుతుండడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. దసరా వరకు రుణాలందుతాయని యువత ఆశతో ఎదురు చూస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపి దసరా వరకు అందించి తమకు న్యాయం చేయాలని యువకులు కోరుతున్నారు.

నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు..



- బానోత్ తారాసింగ్ కేసముద్రం స్టేషన్, మానుకోట జిల్లా

రాజీవ్ యువ వికాసం ద్వారా ఆర్థిక సాయం కోసం ఆశతో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం సాయం అందించకపోవడంతో దరఖాస్తుదారుల్లో నిరాశ ఎదురవుతోంది. దరఖాస్తుదారులు ఉపాధి కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సహాయం చేస్తే నిరుద్యోగులకు ఉపాధి కల్పించి ఆసరాగా నిలిచినట్లవుతుంది.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

'మెనూ ప్రకారం భోజనం అందించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు అన్నారు. మహబూబాబాద్‌లో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల గురుకుల పాఠశాలలో నూతన మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించడంలేదని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న అన్ని గురుకులాలను సంబంధిత అధికారులు తనిఖీలు చేయకపోవడం వలన వార్డెన్లు మెనూ అమలు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అమీర్, పవన్, రాకేష్, వీరేందర్, వంశీ, అనిల్, యాకన్న, అవినాష్ పాల్గొన్నారు.

వాణిజ్య యుద్ధాలకు తెరలేపుతున్న సామ్రాజ్యవాద దేశాలు

- లేబర్ కోడ్‌లతో ప్రమాదంలో కార్మిక సంక్షేమం
- ప్రజాస్వామిక హక్కులను హరించేందుకు మూడు నేర చట్టాలు
- ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వర్‌రావు
- తొలి రోజు హాజరైన 29 జిల్లాల ప్రతినిధులు



రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సాదినేని వెంకటేశ్వర్‌రావు

కేసముద్రం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో వాణిజ్య యుద్ధాలకు తెరలేపేందుకు సామ్రాజ్యవాద దేశాలు కుట్రలు పన్నుతూ సామాన్య ప్రజలను, శ్రామికవర్గాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వర్‌రావు ఆరోపించారు. కేసముద్రం హరిహర గార్డెన్స్‌లో రెండురోజులపాటు నిర్వహించే సంఘం రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శనివారం రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ అధ్యక్షతన ప్రారంభయ్యాయి. తొలుత సంఘం జెండాను ఆవిష్కరించి రాష్ట్రంలోని29 జిల్లాల నుంచి వచ్చిన 130మంది ప్రతినిధులు నినాదా లు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో సాదినేని వేంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక ఫాసిస్టు విధానాలను ప్రతిఘటించే ఉద్యమాలను అణిచివేసేందుకు, జీవించే హక్కును హరించే కుట్రలో భాగంగానే మూడు నేర చట్టాలను తీసుకువచ్చిందని ఆరోపించారు. దేశంలో 50కోట్ల మంది శ్రామికుల్లో కేవలం ఆరు, ఏడుశాతం సంఘటిత రంగ కార్మికులున్నారని తెలిపారు. ఈ రంగంలోని కార్మికుల చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడంద్వారా వారి సంక్షేమం, ఉపాధి, ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడిందని అన్నారు. రానున్న రోజుల్లో కార్మికవర్గం మరింత గడ్డు కాలాన్ని ఎదుర్కోవాల్సివస్తుందని, పాలకుల విధానాలను ప్రతిఘటించేందుకు సంఘం ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఐలయ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న, నందగిరి వెంకటేశ్వర్లు, హెచ్.లింగ్యా, జిల్లాఅధ్యక్షుడు శివారపు శ్రీధర్, ఏపూరి వీరభద్రం, కోటేష్ పాల్గొన్నారు.

సేవా పక్షాన్ని విజయవంతం చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచందర్‌రావు

ఇనుగుర్తి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవాపక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఒద్దిరాజు రాంచందర్‌రావు కోరారు. ఇనుగుర్తిలో పార్టీ మండల అధ్యక్షుడు దుంపల సందీప్ అధ్యక్షతన శనివారం మండలస్థాయి బూత్ అధ్యక్షులు, కార్యకర్తలతో సేవాపక్షం కార్యక్రమాల నిర్వహణ కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు పొలెపల్లి వెంకటేశ్వర్లు, కాల్సాని ప్రభాకర్‌రెడ్డి, పల్లె సందీప్, డి.బాలానాయక్, గాయపు సురేందర్‌రెడ్డి, కామినేని బాలరాజు, కుల వెంకన్న, గోన శ్రీను, సురేష్, బాలు పాల్గొన్నారు.



ఇనుగుర్తిలో మాట్లాడుతున్న ఒద్దిరాజు రాంచందర్‌రావు

రాజీ మార్గమే రాజమార్గం

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతమైన జీవన విధానానికి రాజీమార్గమే అత్యుత్తమ మార్గమని మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకున్నట్లయితే కక్షిదారుల విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కక్షిదారులకు తక్కువ సమయంలో అంతిమమైన పరిష్కారం లభిస్తుందని, అందరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భార్య, భర్తలు కేసు రాజీపడడంతో వారికి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ మొక్కను అందించి, అభినందించారు. 15 మోటార్ వాహన ప్రమాద కేసులు, 220 క్రిమినల్ కేసులు, 2 చెక్కుబౌన్స్ కేసులు, 8 సివిల్ కేసులు, 22 సైబర్ క్రైం, 865 కోర్టు నేరం ఒప్పుకున్న కేసులు, 5350 ప్రీ లిటిగేషన్, ట్రాఫిక్, బీఎస్ఎన్ఎల్, బ్యాంకు, విద్యుత్‌శాఖ మొత్తం 6482 కేసులను పరిష్కరించడంతో పాటు తొర్రూరు కోర్టుకు సంబంధించిన 301 కేసుల పరిష్కారంతో మొత్తం 6783 కేసులు పరిష్కరించి రూ. 1,16,45,000 జరిమానా విధించినట్లు చెప్పారు. ఈ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జీ షాలినీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిమురారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్ రఫీ

యూరియా దొరకక.. పురుగుల మందుతాగిన రైతు

- నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు
- కొత్తగూడ మండల కేంద్రంలో ఘటన



పురుగుల మందుతాగిన మల్లెల నర్సయ్యను ఆస్పత్రికి తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యూరియా దొరకడం లేద ని, పంట ఎండుతుందని మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో శనివారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. కొత్తగూడ మండల కేంద్రానికి చెందిన మల్లెల నర్సయ్యకు పది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వరి పంటను సాగు చేశాడు. శనివారం తన పంటను చూసుకునేందుకు వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. వరి సరిగ్గా ఎదగకపోవడం, మరోవైపు ఎర్రబారుతోండడంతో మనస్తాపానికి గురయ్యాడు. సరైన సమయంలో పంటకు యూరియా వేయకపోవడంతోనే తన పొలం ఎర్రబారిపోయిందని మనోవేదనకు గురయ్యాడు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపంతో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో చుట్టుపక్కల పొలంలో ఉన్న రైతులు గమనించి నర్సయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం కొత్తగూడ పీహెచ్‌పీలో తొలుత ప్రాథమిక చికిత్సనందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆయనను 108ద్వారా నర్సంపేటలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. కాగా, నర్సయ్య భార్య నర్సమ్మ రెండేళ్ల క్రితం మరణించగా, వారికి ఇద్దరు కూతురులు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పుస్తెలతాడు కోసం వచ్చి పొట్టన పెట్టుకున్నారు..

- బంగారం కోసం వృద్ధురాలి హత్య
- శవాన్ని బావిలో పడేసిన వైనం

నెల్లికుదురు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలి నుంచి బంగారు ఆభరణాలు దోచుకోవడానికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు.. తమ ప్రయత్నాన్ని ఆమె అడ్డుకోవడంతో హతమార్చి బావిలో పడేసి వెళ్లిపోయారు. ఈ ఘటన నెల్లికుదురు మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి... నెల్లికుదురుకు చెందిన వీరగానికి రాధమ్మ (80) ఇంట్లో ఒంటరిగా జీవిస్తోంది. ఆమె భర్త హుస్సేన్ పదేళ్ల కిత్రం మృతి చెందగా, వారి ముగ్గురు కుమారులు ఉండగా వివిధ ప్రాంతాల్లో బతుకుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి, రాధమ్మపై ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడు చోరీ చేయడానికి ప్రయత్నించారు. అయితే ఆమె వారి ప్రయత్నాన్ని అడ్డుకొని, పుస్తెలతాడు వారికి చిక్కకుండా గట్టిగా పట్టుకుంది. దీంతో సదరు వ్యక్తులు ఆమెను బలంగా కొట్టి, బలవంతంగా బావిలోకి తోసి పరారయ్యారు. వృద్ధురాలి ఇల్లు గల్లీలో చివరన ఉండటం, ఘటన అర్ధరాత్రి జరగడంతో ఎవరికీ తెలియలేదు.



వీరగాని రాధమ్మ (ఫైల్)

శనివారం ఉదయం ఇంటి సమీపంలోని వారికి రక్తపు మరకలు కనిపించడంతో వారు వచ్చి బావిలో చూడగా రాధమ్మ శవం కనిపించింది. ఎస్సై రమేష్‌బాబు పోలీస్ సిబ్బందితో వచ్చి రాధమ్మ మృతదేహన్ని బయటకు తీశారు. పుస్తెలతాడును చేతిలో పట్టుకొన్న స్థితిలో రాధమ్మ శవం కనిపించడంతో స్థానికులు కంటనీరు పెట్టుకున్నారు. రాధమ్మ గురించి తెలిసిన వారే ఆమెను పొట్టనపెట్టుకున్నారని పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతురాలు కుమారుడు వీరగాని మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సేవాభావమే ఊపిరిగా..

● భారతీయ విలువల రక్షణే ధ్యేయంగా పింగిలి శ్రీనివాస్ జీవనయానం ● నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య
● సామాజిక సేవలో ముందంజ ● ధృడ సంకల్పంతో ముందుకు సాగుతున్న వైనం..



గూడూరులో ఇంట్లో ఉన్న గ్రీనరీ చూపిస్తున్న పింగిలి శ్రీనివాస్

గూడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పిల్లల హృదయాంతరాల్లోకి వెళ్లగలిగే గురువులు కొందరే. అలాంటి వారిలో పింగిలి శ్రీనివాస్ ఒకరు. విద్యార్థుల్లో భారతీయ విలువలను పెంపొందిస్తూ.. వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడమే జీవన వేదంగా ముందుకు సాగుతున్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో ముగ్గురు మిత్రులతో కలిసి హైస్కూల్ నిర్వహిస్తున్న పింగిలి శ్రీనివాస్ నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం..

శ్రీనివాస్ స్వగ్రామం గూడూరు మండలకేంద్రం. తల్లిదండ్రులు.. సరోజన-సత్తయ్య. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన శ్రీనివాస్ అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. భారతీయ విలువల రక్షణ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా 1990 ప్రాంతంలో మానుకోటకు చెందిన కె.కేశవరాజు తో కలిసి గూడూరు మండల కేంద్రంలో వివేకానంద పాఠశాలను ప్రారంభించారు. ఈ క్రమంలో కేశవరాజుతో శ్రీనివాస్ ప్రభావితమయ్యారు. 1995లో ఆర్‌ఎస్‌ఎస్‌లో ఫుల్ టైమర్‌గా కేశవరాజు వెళ్లిపోయిన తర్వాత ఆయన వారసత్వాన్ని ముగ్గురు స్నేహితులు పింగిలి సంజీవరెడ్డి, కాల్వాని శ్రీనివాస్‌రెడ్డి, నలమాస వెంకన్నతో కలిసి శ్రీనివాస్ భుజానికి ఎత్తుకున్నారు. 1997లో పాఠశాల పేరును అరవింద్ పాఠశాలగా మార్చి కొనసాగిస్తున్నారు. అతితక్కువ ఫీజుతో 28 ఏళ్లుగా నడిపిస్తున్నారు. అనేక మంది పేద పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్నారు.

క్యాన్సర్‌ను జయించి...

పాఠశాలను ప్రారంభించిన మూడేళ్లకే అంటే 2000వ సంవత్సరంలో శ్రీనివాస్ అనారోగ్యం పాలయ్యారు. బతకడం కష్టమని వైద్యులు చెప్పినప్పటికీ మనోధైర్యం కోల్పోలేదు. ధృఢ సంకల్పంతో అడుగు ముందుకు వేశారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ సానుకూల అంశాలను వెతుక్కుంటూ ముందుకు సాగారు. పలువురి సహకారంతో చికిత్స పొంది అనారోగ్యాన్ని జయించారు. ఈ క్రమంలోనే ఆయన ప్రకృతితో కలిసి జీవించడం నేర్చుకున్నారు. ఉన్న చిన్నపాటి ఇల్లును అనేక రకాల ఔషధ పండ్లు, కూరగాయల మొక్కలతో తీర్చిదిద్దారు.

సామాజిక సేవలో ముందంజ..

విద్యార్థులకు పాఠాలు బోధించి వదిలేయకుండా వారి కష్టసుఖాల్లో పాలు పంచుకోవడం శ్రీనివాస్ బాధ్యతగా తీసుకున్నారు. ప్రతిభ ఉండి చదువుకోలేని స్థితిలో ఉన్న వారిని గుర్తించి వారి చేరదీసి అండగా నిలిచారు. ఇలా అనేక మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారు. దేశవిదేశాల్లో నేడు ఆయన శిష్యులు ఉన్నత రంగాల్లో రాణిస్తున్నారు. పూర్వ విద్యార్థులు, స్థానికుల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. నిరుపేదలకు ఉపాధికోసం సాయం అందిస్తున్నారు. గూడూరు మండల కేంద్రంలో కాకతీయుల నాటి శివాలయాన్ని శిథిలావస్థ నుంచి అద్భుతంగా మలిచారు. నేడు ఆ ఆలయం భక్తుల రాకపోకలతో నిత్య పూజలతో వర్థిల్లుతోంది. అంతేకాకుండా బతుకమ్మ, దసరా, తదితర పండుగల సందర్భాల్లో ప్రజలను ముందుండి నడిపించడంలో శ్రీనివాస్ సఫలీకృతులవుతున్నారు. ఆయన అడుగు జాడల్లోనే సతీమణి స్వరూప నడుస్తున్నారు.

బీసీ వెల్ఫేర్ డిగ్రీ స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతి భాపూలే గురుకులం (పురుషుల) డిగ్రీ కళాశాల స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.హరి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా నాంచారిమడూరు గ్రామంలో ఉన్న కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు పొందే అభ్యర్థులు సెప్టెంబరు 15, 16 తేదీల్లోపు ధ్రువ పత్రాలతో కళాశాలలో హాజరుకావాలని కోరారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న బెల్లం పానకంతో ఎక్సైజ్ పోలీసులు

మరిపెడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :గుడుంబా స్థావరాలపై శనివారం మరిపెడ మండలంలోని పలు గ్రామాలు, తండాల్లో తొర్రూరు ఎక్సైజ్ పోలీసులు, డీటీఎఫ్ మహబూబాబాద్, ఎస్టీఎఫ్ హైదారాబాద్ టీంలు సంయుక్తంగా దాడులు చేసి గుడుంబా, బెల్లం పానకం ధ్వంసం చేశారు. జర్పులతండా, గుండెపూడి, మాలో త్ తండాలలోని గుడుంబా స్థావరాలను గుర్తించి దాడులు జరిపి ఆరుగురు నిందితులపై ఏడు కేసులు నమోదు చేశారు. 800లీటర్ల బెల్లం పానకం, 23లీటర్ల సారాయిని గుర్తించి పారపోశారు.దాడులలో తొర్రూరు ఎక్సైజ్ సీఐ అశోక్, డీటీఎఫ్ ఎస్సై కీర్తి, ఎస్టీఎఫ్ ఎస్సై సాయికృష్ణ, తొర్రూరు ఎక్సైజ్ ఎస్సై శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి పిల్లర్ల కూల్చివేత

పోలీసులను ఆశ్రయించిన బాధిత కుటుంబం



కూలిన ఇందిరమ్మ ఇల్లు పిల్లర్లు ఇవే

మరిపెడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థల వివాద నెపంతో మరిపెడ మునిసిపల్ పరిధి మాకులతండాలో నిర్మాణ దశలో ఉన్న ఓ ఇందిరమ్మ ఇంటి పిల్లర్లను మరో కుటుంబ సభ్యులు శనివారం కూల్చివేశారు. బాధితులు మరిపెడ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారు బాదావత్ బాబు కుటుంబ సభ్యులు స్థానిక విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వం బాబుకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. ఆ ఇంటి నిర్మాణ పనులు గత నెల రోజులుగా నిర్వహిస్తున్నారు. రెండురోజులుగా పిల్లర్ల పనులను మేస్త్రీలు చేస్తున్నారు. భూక్యా హథిరామ్, భూక్యా బాల కుటుంబ సభ్యులు గడ్డపారలు, పారలతో ఆ పనుల వద్దకు వచ్చి బాబు కుటుంబాన్ని దూషిస్తూ ఇందిరమ్మ ఇంటి పిల్లర్లను కూల్చివేశారని బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఇందిరమ్మ ఇంటి పిల్లర్లు కూల్చివేసిన వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయంపై మరిపెడ పోలీసులను వివరణ కోరగా విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

చిన్నారులు శారీరకంగా అభివృద్ధి చెందాలి



వాల్యా తండా జీపీ పరిధిలోని అంగన్‌వాడీ పాఠశాలలో మాట్లాడుతున్న టీచర్ కౌసల్య

మరిపెడ రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):చిన్నారులు శారీరకంగా అభివృద్ధి చెందాలంటే మంచి పౌష్టికాహారం అందివ్వాలని అంగన్‌వాడీ టీచర్ కౌంసల్య అన్నారు. శనివారం తానంచర్ల శివారు వాల్యా తండా జీపీ పరిధిలోని అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.తల్లిందండ్రులు పిల్లలను ప్రతి రోజు అంగన్‌వాడీ స్కూల్‌కు పంపించినట్లయితే సంభాషణ కర్తలుగా రూపొందుతరన్నారు. అంతేగాకుండా నేర్చుకునే శక్తి వారిలో పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రోజారమణి, బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



తొర్రూరులో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి ధీరజ్‌కుమార్

తొర్రూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : కక్షిదారుల సత్వర సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి డి.ధీరజ్‌కుమార్ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి ధీరజ్‌కు మార్ మాట్లాడుతూ.. రాజీకి అవకాశం ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని.. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ రాజీ అయిన కేసులు 39, సివిల్ కేసులు 4, డ్రంకెన్ డ్రైవ్ కేసులు 191, ఈపిట్టీ కేసులు 23, ఎక్సైజ్ కేసులు 3, సైబర్ క్రైమ్ 7, పీఎల్‌సీ కేసులు 11, మొత్తం 341 కేసులను పరిష్కరించి రూ.12,95,859లు జరిమానా విధించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ రేవతిదేవి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముకుందరావు, న్యాయవాదులు రామకృష్ణ, బాస్కర్, ప్రవీణ్‌రాజు, కోర్టు పరిధిలోని పోలీసులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందిస్తాం

● **తహసీల్దార్ పున్నం చందర్**

కురవి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతుబంధు జాబితాలో పేరు ఉండి, అసలు యూరియా అందని రైతులకు పంపిణీ చేస్తామని తహసీల్దర్ పున్నం చందర్ అన్నారు. సీరోలు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం యూరియా పంపిణీపై మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 వరకు కాంపల్లి, మన్నెగూడెం ప్రాథమిక సహకార సంఘాల కార్యాలయా ద్వారా 635 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందజేశామని పేర్కొన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు ఆదివారం నుంచి రైతుబంధు జాబితా ప్రకారం ఇప్పటి వరకు యూరియా రాని రైతులకు ప్రాధాన్యత ఇస్తూ రోజువారీగా లిస్టు తయారు చేసి వాట్సాప్ గ్రూపులు, సామాజిక మాధ్యమాల ద్వారా రైతులకు యూరియా అందిస్తున్నామన్నారను. అన్ని శాఖల సమన్వయంతో యూరియా అందజేస్తున్నామన్నారు. రైతులు అవసరం ఉన్నంత వరకు యూరియా తీసుకునే విధంగా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో గౌస్‌పాషా, ఏవో చాయా, ఎస్సై సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు



మరిపెడ మునిసిపల్ ఆఫీస్‌లో యూరియా కోసం క్యూలైన్లో ఉన్న రైతులు

మరిపెడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతన్నలకు మళ్లీ అవే తిప్పలు తప్పడం లేదు. పంటలను బతికిం చుకోవడానికి యూరియా అందక తల్లడిల్లుతున్నారు. గంటల కొద్ది క్యూలైన్లో నిలిచి అరిగోస పడుతున్నారు. ఇంకా ఈ యూరియా తిప్పలు ఇంకెన్నడూ తప్పుతుందోనని కన్నీళ్లు తీస్తున్నారు. శనివారం మరి పెడ మునిసిపాలిటీకి చెందిన వందలమంది రైతులు మరిపెడ మునిసిపల్ ఆఫీస్‌కు తెల్లరేసరికి చేరుకొని టోకెన్ల కోసం క్యూలైన్లో గంటలకొద్దీ నిలిచారు. 2వేల మందికి పైగా రైతులు యూరియా కోసం అక్కడికి చేరకొని పొద్దంతా నిరీక్షించారు. అధికారులు 400మందికి టోకెన్లు ఇచ్చారు. కొందరికి టోకెన్లు దొరికి మరికొందరికి దొరకకా పోవడంతో అన్నదాతలు నిరాశతో వెనుదిరిగారు.

తెలంగాణ సాయుధ పోరాటం కమ్యూనిస్టులదే

● **ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి**



అయ్యగారిపల్లిలో మాట్లాడుతున్న నల్లు సుధాకర్‌రెడ్డి

కురవి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాటం ముమ్మాటికి కమ్యూనిస్టులదేనని, కమ్యూనిస్టుల నాయకత్వంలోనే నాటి వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగింది వాస్తవమని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. అయ్యగారిపల్లి గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల స్థూపం వద్ద అరుణ పతకాన్ని ఎగువేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనపై, రజాకార్ల ఆకృత్యాలపై దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలపై కమ్యూనిస్టుల నాయకత్వంలో 4 వేల మంది బలిదానాలతో 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి వేలాది గ్రామాలను భూస్వాముల కబంద హస్తాల నుంచి విముక్తి చేసిన చరిత్ర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానిదేనన్నారు. తెలంగాణ విలీన దినోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, కందుల యాకయ్య, బుర్ర సమ్మయ్య, బొల్లు వెంకన్న, గజ్జి చంద్రయ్య, కన్నె వెంకన్న, ఎన్.గురువయ్య, నాగరాజు, బుడిగే పిచ్చయ్య, వెంకన్న, నల్లు మధుసూదన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సూర్యనారాయణ, యాకన్న పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులు, చట్టాలకు రక్షణ కల్పించాలి



నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

కొత్తగూడ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ హక్కులు, పేసా చట్టం, భూ బదలాయింపు చట్టం, అటవీహక్కుల చట్టాలకు రక్షణ కల్పించాలని తుడుం దెబ్బ, ఆదివాసీ ఉద్యోగసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ హక్కుల దినంను పురస్కరించుకుని ఆదివాసీ సంఘాల నాయకులు శనివారం కొత్తగూడలో కొమురంభీం విగ్రహంకు పూలమాల వేశారు. హక్కులు అమలు చేయాలని, హక్కులు, చట్టాలను రక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల, చట్టాల రక్షణ కోసం మానవ హక్కుల కమిషన్‌లో తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు సువర్ణపాక వెంకటరత్నం, కుంజ నర్సింగరావు, ఈసం నాగేశ్వరరావు, మోకాళ్ల శివ, పూనెం సందీప్‌కుమార్ దొర, మల్లెల సారయ్య, ఆదివాసీసేన నాయకుడు కల్తీ నరేష్, ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు చుంచ రామకృష్ణ, గుమ్మడి లక్ష్మీనారాయణ, చుంచ సారయ్య దొర పాల్గొన్నారు.

పరిహారం చెల్లించండి

● **నిరుపేద దళిత రైతుల డిమాండ్**



తహసీల్దార్ కార్యాలయం వద్ద భూనిర్వాసితులు

డోర్నకల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీతారామ ప్రాజెక్టు కింద భూమి కోలోతున్న తమకు భూ పరిహారం అందించి, ఆదుకోవాలని కన్నెగుండ్లకు చెందిన నిరుపేద దళిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డోర్నకల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్ వద్ద శనివారం తమ గోడును వెళ్లబుచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కన్నెగుండ్ల గ్రామంలో ఒక్కొక్క రైతుకు కొన్ని గుంటల భూమి చొప్పున మొత్తం నాలుగు ఎకరాల భూమి ఉందని, ఆ భూమి సీతారామ ప్రాజెక్టు కాల్వ నిర్మాణంలో పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిపాటి భూమి ఉన్న తమకు భూ పరిహారం అందించి తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వసతి గృహం ఎదుట ధర్నా చేస్తున్న దినసరి వర్కర్లు

కురవి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న రోజువారి, కాంటినిజెంట్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం రెండోరోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు ఎల్లయ్య మాట్లాడుతూ కార్మికులకు పర్మినెంట్ టైమ్‌స్కేల్ చేయాలని కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలని, మృతి చెందిన వారి స్థానం లో కుటుంబసభ్యులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. సరైన వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలి పారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని తెలిపారు. వేతనాలు పెంచి తమను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శోభ, సురేష్, మంగమ్మ, సుధాకర్, సర్వర్, సత్తేమ్మ, ఉప్పలయ్య, సంధ్య పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వీఆర్‌ఎన్ గార్డెన్స్‌లో ఈనెల 17న జరుపతలపెట్టిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని చేగువేరానగర్‌లో సీపీఎం శాఖ సమావేశాన్ని దారావత్ కిషన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా వెట్టి చాకిరి నుంచి ప్రజలకు విముక్తి లభించదని చెప్పారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో భూక్య రాజేష్, సురేష్, నాగేష్, రవి, రమేష్, ఆనంద్, వెంకటేష్, ఉపేందర్, సురేందర్, సతీష్, రఘు, సావిత్రి, సాంకు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

డోర్నకల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైల్వే సామాన్లు చోరీకి పాల్పడిన ఒకరితో పాటు వాటిని కొనుగోలు చేసిన వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ ఆర్పీఎఫ్ ఎస్సై నాగరాజు శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో రైల్వే సామాన్లను కొంతకాలంగా ఓ వ్యక్తి అపహరించుకుపోయి, వాటిని మరో వ్యక్తికి విక్రయిస్తున్నాడు. ఈ విషయంపై ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు అందగా, వారు నిమా ద్వారా చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆ సామాన్లు అమ్మే వ్యక్తి పేరును తెలుసుకుని ఇరువురిని అదుపులోకి తీసుకుని రిమాం డ్ తరలించినట్లు ఎస్సై నాగరాజు చెప్పారు.

జాతీయస్థాయి క్రీడలకు జ్ఞానేశ్వరి ఎంపిక



కొత్తగూడ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుముందు తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగావత్ జ్ఞానేశ్వరి ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెల 9, 10న హైదరాబాద్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ రాష్ట్రస్థాయి క్రీడల్లో పంచాయతీరాజ్ శాఖ నుంచి పాల్గొన్న జ్ఞానేశ్వరి 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్ పోటీలలో మొదటి స్థానంలో రాణించి, బహుమతులు సాధించారు. ఖోఖో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన జ్ఞానేశ్వరిని పలువురు అభినందించారు.

కోటపై పట్టింపేది ?

- తాటికొండ పాపన్న కోటలో అద్భుత కట్టడాలు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో నిర్లక్ష్యం
- కాలగర్భంలో కలుస్తున్న కట్టడాలు
- శిథిలమవుతున్నా చలించని సర్కారు



తాటికొండ ఖిలాగుట్టలోని బురుజు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బహుజనుల నాయకుడు, పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న నిర్మించిన కోట రోజు రోజుకూ శిథిలమవుతోంది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని తాటికొండ గ్రామంలో గుట్ట పైన గుట్ట దిగువన పాపన్న నిర్మించిన కోట గోడలు, గడీ కాలక్రమేణ శిథిలావస్థకు చేరుతున్నాయి. శిథిలమవుతున్న కట్టడాలను పునరుద్ధరిస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా విరాజిల్లుతుందని ప్రజలు కోరుతున్నారు. పాపన్నకోటను పర్యాటక కేంద్రంగా మార్చే దిశగా 2019 అక్టోబరులో వరంగల్ నిట్ ప్రొఫెసర్, సివిల్ ఇంజనీర్ కామేశ్వరరావు ఆధ్వర్యంలోని ఇంజనీర్ల బృందం కోటను పూర్తిస్థాయిలో పర్యటించి అభివృద్ధి చేయడానికి నివేదిక రూపొందించి అప్పటి ప్రభుత్వానికి నివేదించారు. తర్వాత అప్పటి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను గ్రామ నాయకులు కలిసి కోటను అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందించారు. మంత్రి ఆదేశాల మేరకు పురావస్తు శాఖ అధికారులు 2021 జూలై 9న కోటను సందర్శించి కోట అభివృద్ధికి చేయాల్సిన పనులకు ఎస్టిమేషన్‌లు తయారు చేసుకొని వెళ్లారు. పురావస్తుశాఖ అధికారులు వచ్చి వెళ్లి నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా కోటను పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చారిత్రక కట్టడాలను పర్యాటక కేంద్రంగా గుర్తిస్తామని చెప్పి నివేదికలు తయారు చేయించి, చివరకు మొండిచేయి చూపెట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైన పాపన్న కోటను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

కోటలో అద్భుతమైన కట్టడాలు

16వ శతాబ్దంలో మొగలాయి చక్రవర్తులను గడగడలాడించిన స్వయంపాలన కోసం కుతుబ్‌షాహీలను ఎదిరించి ప్రత్యేక రాజ్యాన్ని స్థాపించి భారతదేశ చరిత్రలోనే తొలి బహుజనుల పాలకుడిగా సర్వాయి పాపన్న నిలిచాడు. సముద్ర మట్టానికి సుమారు మూడు వేల అడుగుల ఎత్తున పాపన్న తన రాజ్యాన్ని నిర్మించడం విశేషంగా చెప్పుకోవచ్చు. గుట్ట పైన అద్భుతమైన కట్టడాలున్నాయి. శత్రు రాజ్యాలపై దాడులు చేసేందుకు సైనిక బలగాలను మోహరించేందుకు అనువైన ప్రాంతాన్ని ఎంచుకోవడంలో భాగంగానే తాటికొండ గ్రామాన్ని ఎంచుకున్నాడని చరిత్రకారులు చెబుతున్నారు. మొగల్ సైన్యాన్ని ఎదుర్కోవడానికి గుట్ట దిగువన 500 ఎకరాల స్థలంలో ఆయుధ కర్మాగారాన్ని ఏర్పర్చి ఇక్కడ లభ్యమయ్యే చిట్టిరాళ్లను కరిగించి ఇనుపగుండ్లను రూపొందించి వాటితో శత్రుమూకల పై దాడులు చేసి ప్రజలకు అండగా పాపన్న నిలిచాడు. గుట్ట పైన నిర్మించిన కోట వద్దకు వెళ్లడానికి రాతి కట్టడాలను ఏర్పాటు చేసి ప్రవేశ ద్వారాలు దాటనిదే ముందుకు వెళ్లకుండా ఉన్న నిర్మాణం తీరు చూడముచ్చటగా ఉంది. గుట్టపైన విభిన్న రకాల ఏడు గుండాలు నేటికి ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి. గుట్టపై 100 ఎకరాల విస్తీర్ణంతో చదునైన ప్రదేశం విస్తరించి ఉంది. గుట్ట పైన శివలింగాలు దర్శనమిస్తున్నాయి.

శివాజీకి సమకాలికుడిగా గుర్తింపు ఉన్నా..

ఛత్రపతి శివాజీ సమకాలికుడైన పాపన్నకు శివాజీకి ఇచ్చిన గుర్తింపును నేటికీ దక్కడం లేదని చరిత్రకారులు చెబుతున్నారు. 1874లో ఇంగ్లాండ్ రచయిత జేఏ బోయేల్ ఇండియన్ ఆంటీ క్యూరీ ఇంగ్లిష్ దిన పత్రికలో పాపన్న తాటికొండలో జన్మించినట్లుగా తన వ్యాసంలో ప్రచురించినప్పటికీ ఇక్కడ జన్మించలేదని పాపన్న చరిత్రను వక్రీకరిస్తున్నారని గ్రామానికి చెందిన వారు వివరిస్తున్నారు. రజాకార్ల దోపిడి నుంచి ప్రజలను రక్షించుకోవడానికి ఖిలాషాపూర్‌లో కోటను నిర్మించాడనే నానుడి ఉందన్నారు.



ఖిలాగుట్ట పైన ఉన్న పురాతన నీటి కోనేరు

తాటికొండలో జన్మించిన పాపన్న..

పరిడాల రామారావు 1948లో రాసిన సర్వాయి పాపడు అనే పుస్తకంలో పాపన్న తాటికొండలో జన్మించినట్లు పేర్కొన్నారు. 1972లో జగ్గయ్య, విజయ నిర్మల నటించిన శభాష్ పాపన్న చిత్రంలో బుర్రకథ ప్రదర్శన సన్నివేశంలో పాపన్న పుల్గామ్ అనే గ్రామంలోని తన అమ్మమ్మ ఇంట్లో జన్మించి, స్వగ్రామమైన తాటికొండలో పెరిగినట్లు వివరించారు. ఎస్ఎం ప్రాన్‌రావు రాసిన ప్రజాజ్యోతి పాపన్న (సర్వాయి పాపన్న చారిత్రక ఆధారిత నవల) పుస్తకంలో తాటికొండను కేంద్రంగా చేసుకొని స్వగ్రామంలో రాజ్య విస్తరణను పాపన్న చేసినట్లు రాసి ఉంది. ఇప్పటికి తాటికొండలోని ఖిలాగుట్ట పైన, దిగువన పాపన్న రాజ్యా విస్తరణకు సంబంధించిన అనేక ఆధారాలు నేటికి కనిపిస్తున్నాయి.

కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

చల్లా సుధీర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ



చరిత్రకు నిలువుటద్దంగా నిలుస్తున్న తాటికొండ కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరుతాం. వీర యోధుడు పాపన్న కీర్తిని నలు దిశలా చాటేలా తగు చర్యలు తీసుకుంటాం. కోట దిగువన గల 5ఎకరాల స్థలంలో చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేసి సర్దార్ పాపన్న పార్కుగా నామకరణం చేశాం.

సర్దార్ పాపన్న చరిత్రను వక్రీకరించడం సరికాదు..

ఉబ్బని భిక్షపతి, రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు



సర్వాయి పాపన్న తాటికొండ వాస్తవ్యుడైనప్పటికి, ఆయన చరిత్రను కొందరు వక్రీకరిస్తూ తప్పుడు సమాచారం రాస్తున్నారు. నిజానికి పాపన్న జన్మస్థలం తాటికొండ గ్రామమే. కోటకు మరమ్మతులు చేసి భవిష్యత్తు తరాలకు తెలిసేలా పర్యాటకశాఖ కృషి చేయాలి. ఎంతో ఘన చరిత్ర కల్గిన పాపన్నకు సరైన గుర్తింపును తీసుకురావాలి.



ఉమ్మడి వరంగల్ జట్లను అభినందిస్తున్న జంగా రాఘవరెడ్డి, అరూరి రమేశ్

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

- రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అభివృద్ధి సంస్థ చైర్మన్ జంగా రాఘవరెడ్డి
- ప్రతిభతో ఉన్నత స్థితికి ఎదగాలి : మాజీ ఎమ్మెల్యే అరూరి
- కూనూరులో రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభం

జఫర్‌గడ్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనందిస్తోందని రాష్ట్ర కో-ఆపరేటివ్, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి 44వ సబ్ జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం కూనూరులో ప్రారంభమయ్యాయి. జడ్పీ హైస్కూల్‌లో టోర్నమెంట్ కన్వీనర్ గాదెపాక అయోధ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ క్రీడల అభివృద్ధికి నిధులు వెచ్చించడంతో పాటు క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వారిని ప్రోత్సహిస్తోందన్నారు. గత ప్రభుత్వం క్రీడా రంగాన్ని విస్మరించిందన్నారు. శారీరక వ్యాయామం, క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు ఈ క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను చాటుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలను గ్రామీణ ప్రాంతంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలపై తమ ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు.

కాగా, శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీలను జంగా రాఘవరెడ్డి, ఆరూరి రమేశ్‌లు ప్రారంభించారు. క్రీడల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయా ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాకారులను వారు కలిసి అభినందించారు. కాగా, తొలిరోజు పోటీల్లో మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, అదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, బాలురు, బాలికల జట్లు విజయం సాధించినట్లు క్రీడా నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో డీఎస్‌డీవో వెంకట్‌రెడ్డి, తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బంగారప్ప, రమణ, సహకార సొసైటీ చైర్మన్ టి.కరుణాకర్‌రావు, అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కోశాధికారి కాటం రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి నీరటి ప్రభాకర్, హెచ్ఎంలు పర్వేజ్, సురేందర్‌రెడ్డి, ప్రతినిధులు కాటం లక్ష్మారెడ్డి, వాసుదేవరావు, ముచ్చ భాస్కర్‌రెడ్డి, నెల్లుట్ల అజయ్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, నరహరి, పీడీ సాయికుమార్, అన్నెబోయిన భిక్షపతి, బి.పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీలో మళ్లీ లొల్లి

- భద్రకాళి ఆలయ ధర్మకర్తలుగా మూగ శ్రీనివాస్, ఎస్.శ్రీధర్‌రావు నియామకంపై వివాదం
- మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పరస్పర విమర్శలు
- వారిద్దరూ 'తమ మనుషులు' కాదని ఎవరికి వారు వెల్లడి
- నేడు ఆలయంలో ప్రమాణ స్వీకారం

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి ఆలయంలో తాజాగా జరిగిన ఇద్దరు ధర్మకర్తల నియామకం.. అధికార పార్టీలో రాజకీయ పోరుకు తెరలేపింది. ఈ విషయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ తూర్పు నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి కొండా సురేఖ పరస్పర విమర్శలు గుప్పించుకుంటున్నారు. భద్రకాళి ఆలయానికి ఇప్పటికే 12 మందితో ధర్మకర్తల మండలి ఉండగా, గత బుధవారం (ఈ నెల 10న) మూగ శ్రీనివాస్, ఎస్.శ్రీధర్‌రావు అనే మరో ఇద్దరు వ్యక్తులను ధర్మకర్తలుగా నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ శైలజ రామయ్యార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం అమ్మవారి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తన నియోజకవర్గ పరిధిలో వున్న దేవాలయానికి తనకు తెలియకుండా ధర్మకర్తలను నియమించడం ఏమిటని ప్రశ్నించారు. 'ఇది మంచి పద్ధతి కాదు.. ఎవరి లిమిట్స్‌లో వారు ఉండాలి..' అని వ్యాఖ్యానించారు.

పరోక్షంగా మంత్రి సురేఖను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసినట్టు ప్రచారం జరగడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కొండా సురేఖ... ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తనకు ఇద్దరు ధర్మకర్తలను నియమించుకునే స్వేచ్ఛ లేదా.. అని ప్రశ్నించారు. 'అయినా ధర్మకర్తలుగా నియమితులైన ఆ ఇద్దరు వ్యక్తులు నా మనుషులు కాదు.. అధిష్టానం సూచించిన వారినే ధర్మకర్తలుగా నియమించడం జరిగింది..' అని తెలిపారు. రాజేందర్‌రెడ్డి అదృష్టం కొద్దీ గెలిచాడని ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.

అటు ఎమ్మెల్యే, ఇటు మంత్రి.. ఆ ఇద్దరు ధర్మకర్తలు తమ మనుషులు కాదని చెబుతుండటంతో వీరు ఏ 'కోటా'లో నియమితులైనట్టు అని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. మూగ శ్రీనివాస్ గతంలో 'కుడా' చైర్మన్‌గా వ్యవహరించిన మూగా రామ్మోహన్ సోదరుడు కాగా, శ్రీధర్‌రావు కాంగ్రెస్ సీనియర్ నేత కొండపల్లి దయాసాగర్‌రావుకు దగ్గరి బంధువని తెలిసింది.

నేడు ప్రమాణ స్వీకారం

ఇద్దరు ధర్మకర్తల నియామకంపై మాటల మంటలు చెలరేగుతుండగానే.. వారిచే ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించాలని దేవాదాయ శాఖ నుంచి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ కావడం విశేషం. ఎమ్మెల్యే, మంత్రి మధ్య వివాదంతో ఇద్దరు ధర్మకర్తల నియామకాన్ని పెండింగ్‌లో పెట్టినట్టు ప్రచారం జరిగింది. కానీ రాత్రి వచ్చిన ఉత్తర్వులతో ఆ ప్రచారానికి తెరపడింది.

భద్రకాళి చెంతన సద్దుల బతుకమ్మ

- మాడ వీధుల మైదానంలో నిర్వహించే యోచన
- ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా పూల పండుగగా ప్రాచుర్యం పొందిన బతుకమ్మ వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో యేటా తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఆఖరి రోజు పిండి వంటలతో చేసిన సద్దులతో పెద్ద బతుకమ్మలను పేర్చి సద్దుల బతుకమ్మగా పిలుచుకుంటూ చెరువు ప్రాంతాలకు వెళ్లి ఆట పాటలతో కొలుస్తారు. అయితే ఈసారి వేడుకలను భద్రకాళి అమ్మవారి దేవాలయ ప్రాంగణం చుట్టూ నిర్మిస్తున్న మాడవీధుల్లో నిర్వహించుకునే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులకు ఆదేశించినట్లు సమాచారం.

ఆలయ ప్రాంగణం చుట్టూ నాలుగు వరుసల్లో మాడవీధులు నిర్మిస్తున్నందున వేలాది మందితో బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడానికి ఇదే అనువైన స్థలంగా భావించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులోభాగంగా శనివారం మాడవీధుల ప్రాంగణాన్ని కుడా, మున్సిపల్ అధికారులు, ఇంజనీర్లు పరిశీలించారు. అష్టమి రోజున జగన్మాత జన్మించింది. ఆ రోజునే దుర్గాష్టమిగా పిలుస్తూ జగన్మాతైన భద్రకాళి మాత జన్మదినం కావడంతో అమ్మవారికి సద్దులతో సకల జనులు పూజలు నిర్వహిస్తారు. అమ్మవారిని భద్రకాళి, బతుకమ్మ, భద్రమ్మ ఇత్యాధి పేర్లతో పిలుస్తారు. అందుకే భద్రకాళి అమ్మవారు పుట్టిన రోజున సద్దుల బతుకమ్మ పండుగను నిర్వహిస్తారు.

30న సద్దుల బతుకమ్మ

నవరాత్రుల్లో ఒక్కోసారి పది రోజులు వస్తాయి. ఒక్కోసారి ఎనిమిది రోజులు కూడా వస్తాయి. ఈసారి సద్దుల బతుకమ్మ తిథి రెండు రోజులు వచ్చినందున బతుకమ్మ పండుగను ఈ నెల 30న జరుపుకోవడం శ్రేయస్కరమని భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. భద్రకాళి అమ్మవారు జన్మించిన రోజు పుష్పాలపై అమ్మవారిని ఆరాధించే సంస్కృతి ఉందని శృంగేరి పీఠాధిపతులు విద్యారణ్యస్వామి తెలిపారు. ఇదే విషయాన్ని సుప్రసిద్ధ పండితులు బ్రహ్మీ భూత హంసానంద నాథ దీక్ష నామచితులు కూడా స్పష్టం చేశారు.



మాడవీధుల ప్రాంగణం

చట్టాలపై సమగ్ర అవగాహన ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్

- అవినీతి కేసుల చట్టాల సింపోజియన్‌లో హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్

వరంగల్ లీగల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు అన్ని చట్టాలపై సమగ్రమైన అవగాహన ఉండాలని, అప్పుడే కక్షిదారు లకు సరైన న్యాయం అందించగలుగుతామని హనుమకొండ, వరంగల్ జిల్లాల పోర్ట్‌పోలియో జడ్జి హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. ము ఖ్యంగా యువ న్యాయవాదులు చట్టాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి కోర్టులో కేసులు వాదించాలని ఆయన సూచించారు. శనివారం తె లంగాణ న్యాయవాద పరిషత్ ఏర్పాటుచేసిన అవినీతి నిరోధక చట్టాలు ప్రాక్టీస్ ప్రొసీజర్ సింపోజియన్‌లో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అవినీతి కేసులతో సహా అన్ని కేసుల్లో న్యాయవాదులు మెళకువలు నేర్చు కోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంతానం కమి టీ సిఫారసుల మేరకు 1988లో అవినీతి నిరోధక చట్టం ఏర్పాటైందని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా 62 శాతం అధికారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా అవినీతికి పాల్పడుతున్నట్లు కమిటీ సూచించింది. అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా 180 దేశాల్లో 93వ స్థానం భారతదేశానిదని, దీని ని బట్టి దేశం అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని హైకోర్టు జడ్జి అన్నారు. అవినీతి నిరోధక చట్టంలో మొత్తం 31 సెక్షన్లు ఉన్నాయని, ప్రతీ సెక్షన్ గురించి న్యాయవాదులకు హైకోర్టు జడ్జి వాటి ప్రాధాన్యతను వివరించారు. అవినీతి నిరోధక కేసులు పరిష్కరించేటప్పుడు న్యాయవా దులు చట్టంలో పొందుపర్చిన సెక్షన్లన్నింటిమీద తర్ఫీదు పొందాలని, దానికోసం నిరంతరం కేరళలోలాగా స్టడీ సర్కిల్ నిర్వహించాలని హైకోర్టు జడ్జి సూచించారు.

ఈ కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.ప్రభాక ర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సెంసాని సునిల్, హనుమకొండ, వరంగల్ జిల్లాల యూనిట్ అధ్యక్షుడు చొల్లేటి రామకృష్ణ, వల్లెపురెడ్డి మురళీధర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ, వలుస సుధీర్, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కేవీకే గుప్త కోర్టు ఫీజు చట్టంపై రచించిన పుస్తకాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ ఆవిష్కరించారు.

అమ్మవారి సన్నిధిలో..

వరంగల్ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): భద్రకాళి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్ దర్శించుకున్నారు. శనివారం ఆలయానికి చేరుకున్న ఆయనకు మంగళవాయిద్యాలతో ఆలయ మర్యాదలతో అర్చకులు, ధర్మకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు చేసిన అనంతరం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆయనకు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయమూర్తులు పట్టాభి రామారావు, నిర్మల గీతాంబ, ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, కటకం రాములు, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, మోత్కూరి మయూరి రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీల నుంచి తొలగించాలి



సభలో ఐక్యతను చాటుతున్న నాయకులు

వడ్డెపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు పోరాటం తప్పదని, తమ ప్రాంత నిధులు, నియామకాలు, రిజర్వేషన్లు తమ సామాజిక వర్గానికి చెందే వరకు పోరాడుతామని తెలంగాణ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మేట్ల పాపయ్య దొర అన్నారు. శనివారం హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. 1976లో లంబాడీలను ఎస్టీ జాబితాలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ స్వలాభం కోసం అక్రమంగా చేర్చి ఆదివాసీలను అన్యాయం యానికి గురిచేసిందని ఆరోపించారు. 1975 నుంచి 1977 వరకు దేశంలో ఎమర్జెన్సీ ఉన్న కాలంలో దేశ వ్యాప్తంగా చట్టసభలు పనిచేయని కాలంలో లంబాడీలకు చట్టబద్ధత ఏ విధంగా వచ్చిందని ప్రశ్నించారు. స్వాతంత్ర్యానికి పూర్వం 1935లో సైమన్ కమిషన్, 1965లో లోకూర్ కమిటీ ఇచ్చిన నివేదికల ఆధారంగా ఎస్టీలను గుర్తించాలన్నారు. తద్వారా నోటిఫికేషన్ జారీ చేసి రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ప్రకారంగా అసెంబ్లీలో తీర్మానం చేసి దేశ పార్లమెంట్‌లో తీర్మానం అనంతరం రాష్ట్రపతి ఆమోద ముద్రతో ఎస్టీ తెగలలో గుర్తిస్తారని పాపయ్య దొర పేర్కొన్నారు. ఎటువంటి, ఎలాంటి ఆధారాలు లేకుండా 1976లో కలిపిన లంబాడీలు.. ఆదివాసీల రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కొల్లగొడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సభలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ప్రతినిధులు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, కోడెం కృష్ణప్రసాద్, చాప బాబుదొర, జేజే రాంబాబు, ప్రొఫెసర్ ఈసం సారయ్య దొర, ధనసరి రమేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్ దబ్బకట్ల సుమన్, ఇరుప సారయ్య దొర, కొమురం ప్రభాకర్, మడే భిక్షపతి, మహిళా జేఏసీ నాయకురాలు చేలా శమంతకమణి, ఈసం స్వరూప, మహాలక్ష్మి, రాధిక, గంగా పాల్గొన్నారు.

రాళ్లను ఎందుకు పూజిస్తారు ?

- వేయిస్తంభాల గుడిలో విశాఖ మహిళల వ్యాఖ్యల కలకలం
- ఘర్షణకు దిగిన భక్తులు
- కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేసిన పోలీసులు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాల ఆలయ సందర్శనకు వచ్చిన విశాఖపట్నంకు చెందిన ఇద్దరు మహిళల తీరు ఉద్రిక్తతకు దారి తీసింది. హిందూ దేవుళ్లను కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారంటూ స్థానిక భక్తులు గొడవకు దిగడంతో కలకలం రేగింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన ఇద్దరు మహిళలు కరుణాపురం చర్చిలో ప్రార్థనలకు హాజరై శనివారం సాయంత్రం వేయిస్తంభాల ఆలయానికి వచ్చారు. ఈ క్రమంలో వారు ఆలయ ఆవరణలో తిరుగుతూ 'రాళ్లను ఎందుకు పూజిస్తారు? బొట్టు ఎందుకు పెట్టుకుంటారు..?' అంటూ మహిళా భక్తులను ఉద్దేశించి ఆవహేళనగా మాట్లాడినట్టు చెబుతున్నారు.

దీంతో కోపోద్రిక్తులైన భక్తులు సదరు మహిళలతో ఘర్షణ పడుతుండగా స్థానికుల సమాచారంతో విశ్వ హిందూ పరిషత్ నాయకులు వచ్చారు. వారి రాకతో ఘర్షణ తీవ్రమవుతుండటంతో గుర్తుతెలియని వ్యక్తులు డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను ఆదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

కాగా, ఈ విషయమై హనుమకొండ సీఐ శివకుమార్‌ను వివరణ కోరగా.. వీహెచ్‌పీ కార్యకర్త సందీప్ ఫిర్యాదు మేరకు మహిళలను విచారించామని, కరుణాపురంలో మూడు రోజులుగా ప్రార్థనలో ఉన్నామని, వైజాగ్ వెళ్లేముందు టూరిస్టు ప్రాంతమైన వేయిస్తంభాల ఆలయాన్ని చూద్దామని వచ్చామని తెలిపారన్నారు.

తమకేమీ తెలియదని, అందరూ గేటులోపలికి చెప్పులతో వెళ్తుంటే తాము కూడా వెళ్లామని, ఎలాంటి మత ప్రచారం చేయలేదని చెప్పారని సీఐ వెల్లడించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామని సీఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి బెంగాల్ కార్మికుడి మృతి

గిర్మాజిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన లాబాన్ కర్మాకర్ (41) ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి దుర్మరణం చెందాడు. వరంగల్ జీఆర్‌పీ పోలీసులు తెలిపిన ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం ఉత్తర దినాజ్‌పూర్ జిల్లా చౌదర్ ప్రాంతానికి చెందిన లాబన్ కర్మాకర్ తన బంధువులతో కలిసి వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం విజయవాడలో ఉన్న బంధువుల వద్దకు వెళ్లి శనివారం ఉదయం శాతవాహన రైలులో తిరిగి వస్తుండగా చింతపల్లి -ఎలుగూరు రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు నుంచి జారి పట్టాలపై పడిపోయాడు. ప్రయాణికులు చైన్‌లాగి రైలును నిలిపారు. అతడితో వస్తున్న బంధువులు వెళ్లేసరికే తలకు తీవ్రగాయాలతో లాబాన్ మృతి చెందాడు. వరంగల్ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ పి.రాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. పశ్చిమబెంగాల్‌లో ఉన్న అతడి భార్యపిల్లలకు సమాచారం ఇచ్చామని సీఐ పి.సురేందర్ తెలిపారు.



మృతి చెందిన లాబాన్ కర్మాకర్



సమావేశంలో పాల్గొన్న నరసింహస్వామి, తల్లిదండ్రులు, సిబ్బంది

పిల్లల భవిష్యత్‌కు తోడ్పాటును అందించాలి

● జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను పాఠశాలలు, హాస్టళ్లలో చేర్పించి తమ పని అయిపోయిందని కాకుండా, వారిని క్రమం తప్పకుండా పాఠశాలలు, హాస్టళ్లకు పంపించి వారి భవిష్యత్తుకు సహకరించి ప్రోత్సహించాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి నరసింహస్వామి అన్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 24 వసతి గృహాల్లో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి నరసింహస్వామి మాట్లాడారు. వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. సమావేశాల్లో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ

● విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ప్రణాళిక ప్రకారం.. యూరియా పంపిణీ చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం యూరియా సరఫరాపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు వేదికలు, ప్రాథమిక సహకార సొసైటీ కేంద్రాల వద్ద ఉద్యోగులు అందుబాటులో ఉండి రైతులకు స్టాక్ వివరాలను తెలియపర్చాలన్నారు. ఇప్పటి వరకు యూరియా అందని రైతుల వివరాలను సేకరించి, వారికి యూరియా సరఫరా చేయాలని, కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు, టెంట్స్, కుర్చీలు వేసి అన్ని సదుపాయాలు కల్పించాలని, క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. యూరియా పంపిణీ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 18 మండలాల్లో ప్రత్యేకాధికారులు, వ్యవసాయ, సహకార సంఘాల ద్వారా యూరియా సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. మండల స్థాయిలో కోఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించి పక్కాగా, యూరియా పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాలతో పాటు అదనంగా కేంద్రాల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు నిత్యం కేంద్రాలను తనిఖీ చేస్తూ నివేదికలు సమర్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు విజయనిర్మల, వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, అజ్మీర శ్రీనివాసరావు, విజయ్ చంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● మహబూబాబాద్ : రాష్ట్ర వాతావరణ సూచన ప్రకారం జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్లు, పోలీస్, నీటిపారుదల, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, వైద్య శాఖల అధికారులు సమన్వయంతో ఉండాలన్నారు. అవసరం ఉన్నచోట ముందస్తు ప్రణాళిక ప్రకారం ప్రజలకు సలహాలు, సూచనలు జారీ చేయాలని, తమ పరిధిలో లోలెవల్ వంతెనలు, చెరువులు, కాల్వల వద్ద పరిస్థితిని గమనించాలని సూచించారు. అధికారులంతా ప్రధాన కార్యస్థానంలోనే ఉంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తూ నివేదికలు సమర్పించాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు.

డైలీ వేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో డైలీ వేజ్ వర్కర్లుగా పనిచేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన నిరహార దీక్ష శనివారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కుమ్మరికుంట్ల నాగన్న మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, హాస్టళ్లలో డైలీవేజ్ వర్కర్లుగా పనిచేస్తున్న వారికి జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారని చెప్పారు. 2021 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఆర్థిక శాఖ విడుదల చేసిన జీవో నెంబర్ -64 ప్రకారం.. వేతనాలు చెల్లించాలని మౌళిక ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. దీని ఫలితంగా వేతనాలు బాగా తగ్గుతున్నాయని, జీవో నెంబర్ 64ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చెల్లిస్తున్న విధంగా కనీస వేతనాల గెజిట్ ప్రకారం.. యథావిధిగా వేతనాలు చెల్లించాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రమాదబీమా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, హలావత్ లింగ్యా, పెనక ముత్తయ్య, మంగ, ఇందిరమ్మ, నాగరాజు, లత, మంగీలాల్, కుమార్, యాకమ్మ పాల్గొన్నారు.



దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న కుమ్మరికుంట్ల నాగన్న

17న సాయుధ పోరాట వార్షికోత్సవ సభ

● హాజరు కానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

● పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ వీఆర్ఎన్ గార్డెన్స్‌లో ఈనెల 17న తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను నిర్వహించనున్నామని ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ తెలిపారు. మహబూబాబాద్‌లో సూర్లపాక అశ్వనీ అధ్యక్షతన శనివారం సీపీఎం పట్టణ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించే సాయుధ పోరాట వార్షికోత్సవ సభకు ముఖ్యవక్తగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరవుతున్నారని చెప్పారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ లాంటి పోరాటయోధులు ఎందరో అమరులయ్యారని పేర్కొన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజలు, పార్టీ శ్రేణులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వంకాయల గోపి పాల్గొన్నారు.



సీపీఎం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీతారాంనాయక్



జాతీయ బృంద గీతాల పోటీల విజేతలతో బీవీపీ బాధ్యులు, టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి

బీవీపీ ఆధ్వర్యంలో బృంద గీతాల పోటీలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఆధ్వర్యంలో శనివారం జాతీయ బృంద గీతాల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బీవీపీ రాష్ట్ర బాధ్యులు బండి నరేందర్‌రెడ్డి, వీవీ. నాగేందర్ మాట్లాడారు. భారత్ వికాస్ పరిషత్ పంచ సూత్రాలు (సంపర్క్, సహయోగ్, సంస్కార్, సేవ, సమర్పన్)పై ఆధారపడి పని చేస్తుందని వాటి ప్రాధాన్యతను వివరించారు. టౌన్ సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయం, జాతీయ భావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న బీవీపీని అభినందించారు. అనంతరం జాతీయ బృంద గీతాల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. బీవీపీ మానుకోట శాఖ అధ్యక్షుడు వొబిలిశెట్టి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్వీ చలపతిరావు, డి.నాగశేఖర్‌గుప్తా, డీజీ రాజు, ముడుంబై లక్ష్మీనారాయణచార్యులు, సాదుల ఉదయ్‌శ్రీ, జయప్రకాశ్ లోయా, రేణికుంట్ల గణేష్, కృష్ణ ఆవుల శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, సుజాత, పూనం చంద్ మాల్పానీ తదితరులు పాల్గొన్నారు.

సూరత్‌లో డాక్టర్ అశోక్‌కు ఘన సన్మానం



సూరత్‌లో డాక్టర్ పరికిపండ్ల అశోక్‌ను సన్మానిస్తున్నపద్మశాలి కుల బాంధవులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎక్స్‌ప్రెస్ రైలులో సాధారణ ప్రయాణికుల కోసం నాలుగు జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలని, ఉద్యమించిన మానుకోటకు చెందిన జనరల్ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్‌ను గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు.

అశోక్ ప్రతీ ఎక్స్‌ప్రెస్ రైలులో నాలుగు జనరల్ బోగీల ఏర్పాటు డిమాండ్‌తో ప్రధానికి కోటి ఉత్తరాల ఉద్యమాన్ని చేపట్టి, దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో పర్యటించి 40 లక్షల ఉత్తరాలను రాయించి పోస్టు ద్వారా ప్రధానికి పంపించి నాలుగ బోగీల సాధనలో క్రియాశీల పాత్ర పోషించారని పద్మశాలి సంఘం సూరత్ అధ్యక్షుడు గోనె సోమయ్య చెప్పారు. కరోనా సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో బైక్ యాత్ర చేపట్టి 8 లక్షల మందికి ఉచితంగా హోమియోపతి మందులను పంపిణీ చేశారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో దాసరి శ్రీనివాస్, గోనె రమేష్, బుచ్చిరాములు, నగేష్, వీరన్న, రమేష్, నర్సయ్య, ఉపేందర్, బుచ్చయ్య, హరప్రసాద్, ఆర్తిరాజేష్ పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో నలంద డిగ్రీ కళాశాలలో స్పాట్ ప్రవేశాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఈనెల 18, 19 తేదీల్లో స్పాట్ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నలంద డిగ్రీ కళాశాలలో బీఏ, బీబీఏ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ మ్యాథ్స్, బీఎస్సీ సైన్స్, బీఎస్సీ కంప్యూటర్స్ కోర్సుల్లో స్పాట్ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన, ఆసక్తి గల విద్యార్థినీ, విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 93470 19203ను సంప్రదించాలన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయండి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఆస్పత్రి ఆర్ఎంవో జగదీష్, ఐఆర్‌సీఎస్ బాధ్యులు పీవీ. ప్రసాద్, రవిచందర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా ప్రధాన ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ జగదీష్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా చైర్మన్ పీవీ.ప్రసాద్, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు రావుల రవిచందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ఆవరణలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 78 యూనిట్ల రక్తాన్ని సేకరించి జిల్లా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సమయానికి రక్తం అందక ప్రాణాలు వదిలిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ సభ్యులు బిక్కి వెంకటేశ్వర్లు, ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి కళాధర్ తదితరులు పాల్గొన్నారు.



కిష్టాపురంలో చోరీ ఇంట్లో ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

25 తులాల వెండి, రూ.3 వేల నగదు అపహరణ

కేసముద్రం, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ కిష్టాపురం వీధిలో ఆకుతోట రమేష్ ఇంట్లో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి వెండి, నగదు అపహరించినట్లు బాధితుడు తెలిపారు. శుక్రవారం ఉదయం ఇంటికి తాళంవేసి విజయవాడకు వెళ్లి తిరిగి ఉదయం రాగా ఇంటి ముందు తలుపు తాళం పగులగొట్టి ఉందని తెలిపారు. ఇంట్లో బీరువాలోని 25తులాల వెండి పట్టీలు, రూ.3వేల నగదును ఎత్తుకెళ్లారని చెప్పారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించడంతో మహబూబాబాద్ క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించారు. ఇదిలా ఉండగా ఇదే వీధిలో మరొకరి ఇంట్లోను చోరీకి గుర్తుతెలియని యత్నించినప్పటికీ ఇంట్లోని వారు నిద్రలేవడంతో దొంగలు పారిపోయారని తెలిపారు. ఈ ఘటనలతో ఆ వీధిలోని ప్రజలు దొంగల భయంతో బెంబేలెత్తిపోతున్నారు.

సింగరేణి బొగ్గు గనిలో ప్రమాదం

● భూపాలపల్లి 6 ఇన్‌క్లైన్‌లో కూలిన బొగ్గు పెళ్ల

● కోల్ కట్టర్‌కు తీవ్ర గాయాలు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరి యా పరిధి కేటీకే 6 ఇన్‌క్లైన్ గనిలో శనివారం ప్రమాదం చోటు చేసుకుం ది. బొగ్గు పెళ్లపడి కోల్ కట్టర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఓవర్‌మన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జంగే డుకు చెందిన రాదండి మొండయ్య కేటీకే 6 ఇన్‌క్లైన్‌లో కోల్ కట్టర్‌గా పని చేస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా మొదటి షిఫ్టుకు హాజరై అండ ర్‌గ్రౌండ్‌లోకి దిగాడు. తోటి కార్మికులతోపాటు గని సర్దార్, ఓవర్‌మన్లతో కలిసి వన్ సెమ్ ఎస్ఎస్ సిక్స్ సైడ్ బాటమ్ పనులు చేస్తుండగా రూఫ్ ఫాల్ అయ్యి బొగ్గు పెళ్ల ఒక్కసారిగా కూలి అతడి కాలిపై పడగా తీవ్ర గాయమైంది. ఆ బొగ్గు పెళ్ల సుమారు వంద కిలోల పైనే ఉంటుందని తెలిసింది. కోల్ కట్టర్ మొండయ్యతోపాటు ఓవర్‌మన్ మనోజ్ కూడా స్వల్పంగా గాయపడ్డాడు. దీంతో వీరిద్దరిని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మొండయ్యను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

జీఎం, యూనియన్ నేతల ఆరా

కేటీకే 6 ఇన్‌క్లైన్‌లో ప్రమాదం జరిగిన విషయం తెలియగానే సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి వెంటనే స్పందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడిని పరామర్శిం చారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఈ ఘటనపై యూనియన్ నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఏఐటీయూసీ నాయకులు కొరిమి రాజ్‌కుమార్, మోటపలుకుల రమేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు మధుక ర్‌రెడ్డి, రాజేందర్, బుచ్చయ్య పాల్గొన్నారు.

విమోచనా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



పాలకుర్తిలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పాలకుర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న తెలంగాణ విమోచనా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మోదీ జన్మదినం పురస్కరించుకొని పక్షం రోజులపాటు సేవా కార్యక్రమాలు చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ సారథ్యంలోని కేంద్రం బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టాన్నారు. నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, మండల అధ్యక్షుడు మారం రవికుమార్, వేల్పుల దేవరాజ్, పెనుగొండ సోమేశ్వర్, రాజు, పబ్బ సంతోష్, మచ్చ సునీల్, శ్రీనివాస్, చీకుడు అశోక్, నవీన్ ఉన్నారు.

బెల్ట్ షాపుల నిర్వహణపై ఇంటెలిజెన్స్ ఆరా?

ములుగు టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బెల్ట్ షాపుల నిర్వహణపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. 'బెల్ట్ షాపుల జోరు.. జీవితాలు బేజారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనంపై స్పందించినట్టు సమాచారం. జిల్లాలో బెల్ట్ షాపుల దందా విచ్చలవిడిగా జరుగుతుండటంపై సంబంధిత అధికారులపై కలెక్టర్ దివాకర సీరియస్ అయినట్లు తెలిసింది. ములుగు జిల్లాలో మద్యం షాపు నిర్వాహకులు ఆటోల ద్వారా బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నట్టు వస్తున్న ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ కమిషన్ కూపి లాగుతున్నట్టు సమాచారం.

మృతి చెందిన స్నేహితుల కుటుంబాలకు రూ.లక్ష సాయం

గూడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండల కేంద్రంలోని చంద్రుగూడెంలో ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన చొప్పరి రమేష్, ఎండి.యాకూబ్ కుటుంబాలకు 1991-92 పదో తరగతి బ్యాచ్ బాల్యస్నేహితులు ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున శనివారం ఆర్థిక సాయం అందించారు. స్నేహితులు స్వయంగా మృతుల కుటుంబాల సభ్యులను కలిసి నగదును అందించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మహ్మద్ ఖాసీం, కొనకంచి నాగమల్లేశ్వర రావు, నేరళ్ల వేమన, కోరే పాపయ్య, నూకల ఉపేందర్, బత్తుల లక్ష్మణ్, మండల శ్రీనివాస్, చెలుపూరి శ్రీశైలం, చెన్నబోయిన లక్ష్మణ్, ఈసం రమేష్, చుంచా బాలయ్య, సదువాల వీరస్వామి, ఓరుగంటి విజయ్‌కుమార్, సీహెచ్.దాసు, బేతం లక్ష్మినారాయణ, పొడిశెట్టి సురేష్, సత్యం, ఎండి.యాకూబ్‌ఆలీ, దొడ్డ రమేష్, మాలోతు రెడ్యా పాల్గొన్నారు.

యూరియా పంపిణీ కోసం సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో తిరుపతిరెడ్డి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని నాలుగు రైతు వేదికల్లో ఈనెల 14న యూరియా పంపిణీ కోసం మండల స్థాయి కో-ఆర్డినేషన్ సమావేశం శనివారం నిర్వహించినట్లు తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఏవో తిరుపతిరెడ్డి తెలిపారు. పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయం, శనిగపురం పీఏసీఎస్ సెంటర్, ఏటిగడ్డతండ, మల్యాల, జంగిలిగొండ, వేమునూరు రైతు వేదికల ద్వారా 60 టన్నుల యూరియా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఇందులో రెవెన్యూ, పంచాయితీరాజ్, మునిసిపల్, పట్టణ, రూరల్ పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొని రైతులకు యూరియాను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

జనగామ రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ 15న చేపట్టిన తహసీల్దార్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్ పిలుపునిచ్చారు. గోపారాజుపల్లి, పెద్దపహాడ్ గ్రామంలో దివ్యాంగుల చేయూత పింఛన్‌దారులు చైతన్య సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా కుమార్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను పెంచి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. గడ్డం సోమరాజు, భారతల లక్ష్మయ్య, కిష్టయ్య, సుగుణ, బాల్‌రాజు పాల్గొన్నారు.

పోరాటాన్ని వక్రీకరించొద్దు



నివాళులర్పిస్తున్న రాజారెడ్డి

పాలకుర్తి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం, భుక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరించొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి విమర్శించారు. శనివారం 17న నిర్వహించే రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని పాలకుర్తిలో చాకలి ఐలమ్మ విగ్ర హానికి నివాళులర్పిం చారు. అనంతరం మా ట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం,4 వేల మందికి పైగా ప్రాణాలను త్యాగం చేస్తే కొంత మంది కేవలం హిందు, ముస్లింల మధ్య జరిగిన పోరాటమని వక్రీకరించడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సొప్పరి సోమన్న, కావటి యాదగిరి, మల్లేశం ఉన్నారు.